నమస్తే తెలంగాణ నిపుణ
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
నిపుణ Guide to Excellence I పోటీపరీక్షల ప్రత్యేకం
గురువారం 29-2-2024
నిపుణ
నమస్తే తెలంగాణ
Telangana Today

# సమ్మిళిత విధానం.. ప్రజాస్వామ్యానికి కొలమానం

- ప్రపంచ వ్యాప్తంగా దాదాపు అన్ని సమాజాల్లో సామాజిక వెలి అనేది ఒక సమస్యగా కొనసాగుతున్నది. శరీర రంగు, జాతి, కులం, మతం వంటి అంశాల ఆధారంగా కొన్ని సమూహాల ప్రజలను వారి మనుగడ జీవనోపాధికి అవసరమైన అవకాశాలు, వనరులను వారికి దక్కనివ్వకుండా చేయడం వల్ల సామాజిక బహిష్కరణ ఏర్పడుతుంది.
- సామాజిక వెలి అనేది అంతర్గతంగా గతిశీలమైనది. సామాజిక వెలిని నిర్వచించడంలో గృహవసతి, ఆరోగ్యం, విద్య, ఆర్థిక అంశాలు, మౌలిక అవసరాలు, మన్నికైన వస్తువులు, సామాజిక సంబంధాలు అసంతృప్తి వంటి చరరాసులను పరిగణనలోకి తీసుకుంటారు.
- కాలం దృష్ట్యా నిర్వహిస్తే సామాజిక, సమ్మిళిత విధానాలు అనేవి ప్రజాస్వామ్యానికి సంబంధించిన మౌలికమైన అంశాలు.
- జీవనోపాధి, స్థిరమైన ఉపాధి ఆదాయాలు పరపతి లేదా భూమి, గృహవసతి కనిష్ఠ లేదా వస్తు వినియోగస్థాయి, విద్య, నైపుణ్యాలు, సాంస్కృతిక పెట్టుబడి, పౌరసత్వం, సామాజిక సమానత్వం, సంక్షేమ రాజ్యం, న్యాయ పరమైన సమానత్వం, ప్రజాస్వామిక భాగస్వామ్యం, ప్రజా వస్తువులు, మర్యాద, సంతృప్తి పరచడం, అవగాహన కుటుంబం, జాతి లేదా ప్రాబల్య జాతి వంటి అంశాలు సామాజిక వెలిని నిర్ధారిస్తాయని అమర్త్యసేన్ పేర్కొన్నారు.
- భారతదేశంలో సామాజిక వెలి అనే పదాన్ని అమర్త్యసేన్ మొదటిసారి ఉపయోగించాడు.
- సామాజిక వెలి అనే భావన సామాజిక, సాంస్కృతిక, న్యాయ, ఆర్థిక, రాజకీయ కోణాలకు విస్తరించింది. అంటే సహజ న్యాయ సూత్రాల ప్రకారం పొందవలసిన హక్కులను, అవకాశాలను ఒక వర్గం ప్రజలకు అందకుండా నిరోధించడమే సామాజిక వెలి.
- భారతదేశంలో కుల వ్యవస్థ అంటరానితనం, సామాజిక అసమానతలకు దారితీసింది. మత పరమైన మైనారిటీ వర్గాలు, తెగలు, మహిళలు, దివ్యాంగులు, పిల్లలు వంటి బలహీన వర్గాలు వివిధ రూపాల్లో సామాజిక వెలికి గురవుతున్నారు. ప్రాంతీయ అసమానతలు కూడా సామాజిక వెలికి కారణమవుతున్నాయి.
- 1990వ దశకం నుంచి ప్రారంభమైన ప్రపంచీకరణ, ఆర్థిక సరళీకరణ విధానాలు నూతన అభివృద్ధి నమూనాకు శ్రీకారం చుట్టడం వల్ల గ్రామీణ సామాజిక, ఆర్థిక వ్యవస్థలు ప్రత్యక్షంగా ప్రభావితమై పరోక్షంగా సామాజిక వెలికి నేపథ్యంగా మారుతున్నట్లు సామాజికవేత్తలు పేర్కొన్నారు.
- సామాజిక వెలి, అసమానతల వల్ల సమాజంలోని వివిధ వర్గాల మధ్య అంతరాలు ఏర్పడి సామాజిక స్థిరీకరణకు కారణమవుతుంది.
- సామాజిక వెలి వల్ల మానవ వనరులు వినియోగంలోకి రాకుండా పోతున్నాయి. అదే సమయంలో నేరపూరిత వాతావరణం నెలకొంటున్నది. ఇది చివరకు సామాజిక అలజడులకు, సంఘర్షణలకు, విప్లవాలకు దారితీసే ప్రమాదమున్నది.
- సామాజిక వెలి అనే సమస్యను ఎదుర్కొంటున్న దేశాలు మానవాభివృద్ధి సూచిక (హెచ్‌డీఐ), మానవ సంతోష సూచీ (హెచ్‌హెచ్ఐ)లో వెనుకబడి ఉన్నట్లు అనేక అధ్యయనాల్లో వెల్లడయ్యింది.



**సామాజిక వెలి**

- సామాజిక వెలి అనే పదాన్ని మొదటిసారిగా ఉపయోగించిన వ్యక్తి -ఫ్రాన్స్‌కి చెందిన రెనే లినెయర్ -1974
- సమాజ నిర్మాణంలోనే అసమానతలు ఉన్నందున సహజంగానే కొన్ని వర్గాలు సమాజంలోని అవకాశాలను సదుపాయాలను మిగతా వర్గాలతో సమానంగా అందుకోలేకపోతున్నాయి.
- ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చెందిన అమెరికా, బ్రిటన్ మొదలు వెనుకబడిన దేశమైన నైజీరియా వరకు దాదాపు అన్ని దేశాల్లో సామాజిక అసమానతలు వివక్ష నేటికి ఏదో ఒక రూపంలో కొనసాగుతూనే ఉన్నాయి.
- మానవ సామాజిక పరిణామ క్రమంలో భాగంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ, మతపరమైన ప్రక్రియల్లో అనేక మార్పులు, చేర్పులు సంభవించాయి. ఫలితంగా కొన్ని వర్గాలు మిగతా వర్గాల మీద ఆధిపత్యాన్ని ప్రదర్శించి అన్ని రకాల అవకాశాలను తమకు అనుకూలంగా మలచుకోవడంతో సామాజిక అసమానత, వివక్ష మొదలయ్యింది.
- సామాజిక మినహాయింపు అనే భావన ప్రపంచంలో మొదటిసారి 18వ శతాబ్దంలో ఫ్రాన్స్‌లో జరిగిన సాంస్కృతిక, రాజకీయ ఉద్యమాల ఫలితంగా వెలుగులోకి వచ్చింది.
- ఫ్రెంచ్ విప్లవం నినాదాలైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక మినహాయింపు తీవ్రతను ప్రపంచానికి చాటి చెప్పడంతోపాటు సామాజిక సమానత్వం సామాజిక భాగస్వామ్యం, సమ్మిళిత భాగస్వామ్యం వంటి విశ్వజనీన సూత్రాలను ప్రపంచానికి పరిచయం చేయడం జరిగింది.
- ప్రఖ్యాత సామాజిక శాస్త్రవేత్త ఎమిలీ డర్క్‌హైమ్ 19వ శతాబ్దంలో (1895) సామాజిక సంఘటితం/ కలిసి ఉండటంపై శాస్త్రీయ సిద్ధాంతాలను ప్రతిపాదించారు
- ఫ్రాన్స్‌తోపాటు యూరోపియన్ యూనియన్, యునైటెడ్ కింగ్‌డమ్‌లో 1970 దశకం నుంచి అవలంబిస్తున్న అభివృద్ధి నమూనాల వల్ల సామాజిక మినహాయింపు అనే భావన విభిన్న రూపాల్లో వ్యక్తమవుతుంది.

**గ్రూప్స్ ప్రత్యేకం**
**సామాజిక నిర్మితి**

- ప్రపంచ కార్మిక సంస్థ విడుదల చేసిన నివేదికలో యూరోపియన్ సమాజంలో రాజకీయ, సామాజిక సమీకరణలు, మినహాయింపులు, సామాజిక భాగస్వా మ్యం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించడం జరిగింది.
- పేదరికం, సామాజిక అసమానతలు, సామాజిక అణచివేత, సామాజిక వివక్ష వల్ల కార్మికశక్తి ఆర్థికాభివృద్ధిలోకి రాలేకపోతున్నదని అనేక అధ్యయనాల్లో వెల్లడైంది.
- సామాజిక మినహాయింపు అనేది ఒక సంక్లిష్టమైన బహుముఖ ప్రక్రియ.
- సాధారణంగా సమాజంలోని సభ్యులందరికి సమానంగా లభించాల్సిన సామాజిక జీవనం, అవకాశాలు, సామాజిక హక్కులు వంటివి దురదృష్టవశాత్తు లింగ భేదం, కులం, తెగ, వైకల్యం తదితర కారణాల వల్ల కొన్ని వర్గాలకు లభించడం లేదు. ఫలితంగా సామాజిక అసమానతలు, సామాజిక వివక్ష పెరిగి సామాజిక సంఘర్షణలు తలెత్తుతున్నాయి.

## సామాజిక అసమానత

- సంపద, అధికారం, హోదా మొదలైన వాటి అసమాన పంపిణీని సామాజిక సమాజంలో కొన్ని సామాజిక వర్గాలను ఉద్దేశపూర్వకంగా జన జీవన స్రవంతికి దూరంగా ఉంచడం వారి అభివృద్ధికి అవసరమైన అవకాశాలను నిరాకరించడం అనే ప్రక్రియను సామాజిక పరాధీనత అంటారు.
- ఏ సమాజంలో అయితే సామాజిక విభేదీకరణ, సామాజిక స్థిరీకరణ ఉంటుందో అనివార్యంగానే ఆయా సమాజాల్లో సామాజిక అసమానత / సామాజిక పరాధీనత కనబడతాయి
- సామాజిక అసమానత/ పరాధీనత రూపాలు
  1) జాతి 2) కులం
  3) వర్గం(ఆర్థిక స్థితి)
  4) లింగపరమైన వివక్ష
  5) జాతి వైరుధ్యం

**సామాజిక అసమానత పర్యవసానాలు**

1) సామాజిక వివక్ష
2) సామాజిక ఆర్థిక పరమైన దోపిడీ
3) నిర్ణయాధికారంలో భాగస్వామ్యం లేకపోవడం
4) సామాజిక వెనుకబాటుతనం

- సామాజిక మినహాయింపు ప్రధానంగా మూడు రూపాల్లో కనబడుతుంది.

1) **వనరుల పరంగా:** సామాజిక వనరుల పరంగా వస్తుపరమైన/ ఆర్థిక పరమైన వనరుల పరంగా, ప్రభుత్వ, ప్రైవేట్ సేవలను పొందే వెసులుబాటు పరంగా
2) **భాగస్వామ్య పరంగా:** ఆర్థిక భాగస్వామ్యం, సామాజిక భాగస్వామ్యం, రాజకీయ, పౌర సమాజంలో భాగస్వామ్యం, సంస్కృతి, విద్య, నైపుణ్యాల పరంగా భాగస్వామ్యం.
3) **నాణ్యమైన జీవితం పరంగా:** ఆరోగ్యం, ఆనందం, జీవించే పరిస్థితులు, నేరాలు, నేరపూరిత వాతావరణం.

- ప్రతి సమాజంలో సామాజిక జీవనం, సామాజిక కొనసాగింపు అనేవి ఆ సమాజంలోని వనరుల లభ్యత, వాటి అందుబాటు, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక ప్రక్రియలో అన్ని వర్గాలకు కల్పించే భాగస్వామ్యంపై ప్రత్యక్షంగా ఆధారపడతాయి.
- సమాజ శాస్త్రం నియమాల ప్రకారం సహజ వనరులు, అవకాశాలు సమాజ సభ్యులందరికి సమానంగా అందుబాటులో ఉండాలి. అయితే వివిధ రకాల కారణాల వల్ల కొన్ని వర్గాలు మాత్రం వివక్ష, నిర్లక్ష్యానికి గురయ్యాయి.
- అమర్త్యసేన్ వివరణ ప్రకారం సామాజిక వెలి రెండు రకాలు.

**పూర్తిస్థాయి సామాజిక వెలి**

- సమాజంలో పేదరికం, వలస వంటి విభిన్న కారణాల వల్ల హక్కులు, రక్షణలు పూర్తిగా పొందలేని పరిస్థితిని పూర్తిస్థాయి సామాజిక మినహాయింపు అంటారు.

**పాక్షిక సామాజిక వెలి**

- వెనుకబడిన వర్గాలకు, హక్కులు, రక్షణల పరంగా, పూర్తిస్థాయి భాగస్వామ్యం కల్పించకపోవడాన్ని పాక్షిక సామాజిక మినహాయింపు అంటారు.

**సామాజిక వెలి స్థాయిలు:** సామాజిక మినహాయింపు / వివక్ష వివిధ స్థాయిల్లో వ్యక్తమవుతుంది.

**వ్యక్తిగత మినహాయింపు:** మొదట వ్యక్తిగత మినహాయింపును పరిశీలిస్తే మౌలికంగా సామాజిక స్థితిగతులు అర్థమవుతాయి.

- ప్రపంచ వ్యాప్తంగా సంక్షేమ సంస్కరణలు ప్రారంభం కావడానికి ముందు (1,900) పశ్చిమ దేశాల్లో ఏకాంత తల్లులు, వికలాంగులు, లెస్బియన్స్, గే, లింగ మార్పిడి చేసుకున్న వ్యక్తులకు సామాజిక, ఆర్థిక ప్రక్రియల్లో శ్రామిక శక్తిలో సరైన భాగస్వామ్యం కల్పించలేదు.

**కమ్యూనిటీ స్థాయి**

- సామాజిక మినహాయింపు అనేది కమ్యూనిటి స్థాయిలో వివిధ రూపాల్లో కొనసాగుతున్నది.
  1) జాతి పరంగా (నల్లజాతి–అమెరికా)
  2) కుల పరంగా (దళితులు– భారతదేశం)
  3) తెగ పరంగా (గిరిజనులు)
  4) లింగభేదం పరంగా (మహిళలు)

**వామపక్ష భావజాలం**

- రాడికల్ మనస్తత్వం. సమాజాన్ని పూర్తిగా మార్చాలనే మనస్తత్వం, సంఘ సంస్కరణ కోసం పోరాడుతున్న వ్యక్తులను సమాజంలోని మెజారిటీ వ్యక్తులు తమలో కలుపుకోకపోవచ్చు.

**ఇతర ప్రాంతాల ప్రజలను కలుపుకోకపోవడం**

- అభివృద్ధి, ప్రాజెక్టుల వల్ల స్థానభ్రంశానికి గురైన ప్రజలు, వర్గాలు వేరే ప్రాంతానికి వలస పోవడం

**ఉపాధి కోసం వలస వెళ్లడం**

- యుద్ధాలు, విపత్తులు సంభవించినపుడు అనివార్యంగానే ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం జరుగుతుంది.
- ఈ విధంగా వలస పోయిన ప్రజలు అక్కడి సమాజంలో భాగంగా జీవించడానికి ప్రయత్నించినప్పటికీ స్థానిక ప్రజలు వారిని పూర్తిగా తమలో కలుపుకోకపోవచ్చు.

**ఆధునిక కాలంలో సామాజిక వెలి రూపాలు**

- ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులు
- స్వలింగ సంపర్కులు
- లింగమార్పిడి చేయించుకున్న వ్యక్తులు
- దివ్యాంగులు
- ఇతర బలహీన వర్గాలకు సమాజంలో పూర్తి భాగస్వామ్యం లభించడం లేదు.

**భారతదేశంలో సామాజిక వెలి**

- భారతదేశానికి ప్రాచీన కాలంలో ఆర్యులు, మధ్య యుగంలో ముస్లింలు, ఆధునిక కాలంలో ఆంగ్లేయులు వివిధ కారణాలు, అవసరాలు, అవకాశాల కోసం వచ్చారు.
- ఆర్యులు భారతీయ సమాజంలో అంతర్భాగమైనప్పటికీ మతపరంగా ముస్లింలు, క్రైస్తవులు మాత్రం మైనారిటీ వర్గంగా, సామాజిక మినహాయింపుగానే ఉన్నారు.
- క్రైస్తవ మిషనరీల ప్రభావం వల్ల సామాజికంగా అట్టడుగున ఉన్న దళితుల సామాజిక అంతస్తు కొంత వరకు మెరుగైనప్పటికీ వీరు క్రైస్తవ మతం పేరుతో హిందూ సమాజంలో మినహాయింపు వర్గంగానే కొనసాగుతున్నారు.
- సామాజిక కట్టుబాట్లు, సంప్రదాయాలు, సాంస్కృతిక జీవనం వంటి అంశాల వల్ల మహిళలు మొదటి నుంచి రెండోతరగతి వర్గంగానే జీవించాల్సి వస్తుంది. ప్రాచీన కాలంలో వితంతువులకు భారతీయ సామాజిక జీవనంలో పూర్తి భాగస్వామ్యం లేదు.
- ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో వితంతువులకు, అనాథలకు ఆదరణ లభించినప్పటికీ సామాజికంగా మాత్రం భాగస్వామ్యం కల్పించలేదు. ఇది కూడా సామాజిక మినహాయింపు పరిధిలోకి వస్తుంది.
- ఆధునిక కాలంలో భారతదేశంతో సహా ప్రపంచ వ్యాప్తంగా దాదాపు అన్ని దేశాల్లో సామాజిక మినహాయింపు ప్రక్రియ వివిధ రూపాల్లో కొనసాగుతూనే ఉన్నది.

**భారతదేశంలో లింగపరమైన వివక్ష రూపాలు**

- లింగ నిర్ధారణ ద్వారా తల్లి గర్భంలోనే ఆడపిల్లలను చంపడం
- వరకట్నం
- యాసిడ్ దాడులు
- పనిచేసే చోట ఇబ్బంది పెట్టడం
- గృహంలో చేసే పనికి వెలకట్టకపోవడం
- బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో కొడుకులపై ఆధారపడే పరిస్థితి
- శ్రామిక శక్తిలో ఆశించిన స్థాయిలో భాగస్వామ్యాన్ని కల్పించకపోవడం. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకపోవడం.
- రాజ్యాంగ బద్ధంగా, చట్టపరంగా మహిళలకు కల్పించిన రక్షణలు పూర్తిగా అమలుకు నోచుకోకపోవడం.

**కులం:** జాతీయ సమాజం మొదట వర్ణ వ్యవస్థ ఆధారంగా నిర్మాణమైనప్పటికీ కాలక్రమేణా వర్ణ వ్యవస్థ కులవ్యవస్థగా రూపాంతరం చెందింది. వర్ణ వ్యవస్థలోని బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణాలు సమాజంలో ఉన్నతమైన స్థానాన్ని పొందినప్పటికీ నాలుగో వర్ణమైన శూద్రులు, అస్పృశ్యులు సామాజిక వివక్షకు గురయ్యారు.

- అంటరాని వర్గాలుగా దళితులు సామాజికంగా దోపిడీకి గురయ్యారు.
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 ప్రకారం అంటరానితనాన్ని నిషేధించినప్పటికీ షెడ్యూల్డ్ కులాలు సామాజిక వెలికి గురవుతున్నారు. భారతదేశంలో ఒక వ్యక్తి సామాజిక అంతస్తు కులం ప్రాతిపదికన నిర్ణయించడం జరుగుతున్నది.
- పాశ్చాత్య దేశాల్లో వ్యక్తి సామాజిక అంతస్తును వారు జీవిత కాలంలో సాధించిన విజయాల ఆధారంగా నిర్ణయించడం జరుగుతుంది.
- భారతీయ సమాజంలో కుల వ్యవస్థలో నిమ్న కులాల పట్ల వివక్ష ప్రదర్శించడం వల్ల సామాజిక వెలి కొనసాగుతున్నది.

విన్మయి పబ్లికేషన్ సౌజన్యంతో..